ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
మంగళవారం 23 జనవరి 2024

## సినిమా షూటింగ్‌లో ప్రమాదం

● హీరో, హీరోయిన్‌కు స్వల్పగాయాలు

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'ఉసిరు' కన్నడ సినిమా చిత్రీకరణ వేళ మడికేరి సమీపంలోని మక్కందూరు వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. హీరో సంతోష్, హీరోయిన్ అపూర్వ బైక్‌పై వేగంగా వెళ్లే సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సమయంలో ఒక్కసారిగా స్కిడ్ కావడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఇద్దరి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మాదాపుర ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరికీ చికిత్స అందించారు. చిత్రీకరణను రద్దుచేశామని దర్శకుడు పెనెమ్ ప్రభాకర్ మీడియాకు చెప్పారు.

# మార్మోగిన రామనామం

● వేలాది ప్రాంతాల్లో రాముడికి పూజలు ● వీధివీధినా ప్రసాదం పంపిణీ



అగరలో శ్రీరాముడి ఊరేగింపు ఇలా...

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా సోమవారం రామనామం మార్మోగింది. అయోధ్య మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను ప్రజలు సంబరంగా చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ఆలయాలతోపాటు రాముడి మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడళ్లలో భారీ స్ర్కీన్లు, ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెలివిజన్‌లతోపాటు ఇంటింటా ప్రజలు వీక్షించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు జై శ్రీరామ్ నినాదాలతో ఊరేగింపులు సాగాయి. వీధికి రెండు మూడు చోట్ల శ్రీరాముడి హోర్డింగులు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి ప్రసాదం, మజ్జిగ వడపప్పు పంపిణీ చేశారు. మరోవైపు ప్రధానమంత్రి ప్రసంగాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. సాయంత్రం ప్రతి ఇంటా రామజ్యోతి వెలిగించారు. బాణసంచా పేల్చి దీపావళి వేడుకలా చేసుకున్నారు. అయోధ్య రామమందిర తీర్థ ట్రస్టు సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఉడుపి పెజావర పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ భక్తులు సంబరాలు జోరుగా చేసుకున్నారు. ఉడుపితోపాటు బెంగళూరులోని కత్రిగుప్పె సర్కిల్లోని మఠంలోనూ ఉదయం నుంచి మంత్రోచ్చారణ, రామభజనలు చేశారు. మైసూరులో 111 అడుగుల గంధపు అగర్‌బత్తీని వెలిగించడం ద్వారా వేడుకలు చేసుకున్నారు. ఎంపీ ప్రతాప్‌సింహ తోపాటు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మైసూరు ప్యాలెస్‌తోపాటు చాముండేశ్వరి ఆలయం, నంజన్‌గూడు శ్రీకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండ్య, రామనగర, కనకపుర, చిక్కమగళూరు పట్టణాల్లో శ్రీరాముడి ఊరేగింపులు, భజనలు కొనసాగాయి. చామరాజనగర జిల్లా కొళ్లేగాళలో శిథిలావస్థకు చేరుకున్న రామమందిరాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ పనులు చేశారు. పారిశ్రామికవేత్త సునితాతిమ్మేగౌడ నేతృత్వంలో తీర్చిదిద్దిన ఆలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళ, కుక్కె ఆలయాలలో రాముడి చిత్రపటాలకు పూజలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉడుపి అష్ట మఠాలలో నిరంతర పూజలు కొనసాగాయి. వివిధ మఠాధిపతులు రాముడి పూజల్లో పాల్గొన్నారు. బెళగావి, చిక్కోడి, బాగల్కోటె, బీదర్, కొప్పళ జిల్లాల వ్యాప్తంగా వేడుకలు కొనసాగాయి.



మైసూరులో 111 అడుగుల అగరుబత్తిని వెలిగిస్తున్న ఎంపీ ప్రతాప్‌సింహ

## పిల్లలకు నామకరణం

విజయపురలోని జ్ఞానయోగి సిద్దేశ్వర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఐదు రోజుల వ్యవధిలో 61 మంది పిల్లలు జన్మించగా వారందరికీ అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సమయంలోనే నామకరణం చేశారు. ఆసుపత్రిలో ఐదురోజులపాటు ఉచితంగా కాన్పులు చేశారు. ముగ్గురు పిల్లలకు రామ, ఓ శిశువుకు సీత పేరు పెట్టారు. బెంగళూరు నగర వ్యాప్తంగా సోమవారం 60 మంది శిశువులు జన్మించారు. వీరందరికీ ప్రత్యేక సౌలభ్యాలు కల్పించారు. వాణీ విలాస్‌లో 28 మంది పిల్లలు జన్మించగా వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో మిగిలినవారు జన్మించినట్లు సమాచారం.



విజయపుర ఆసుపత్రిలో శిశువులతో ప్రజలు, బంధువులు

## రాష్ట్రం నుంచి తరలిన ప్రముఖులు

అయోధ్య రామమందిరం నిర్మాణ సంస్థ ట్రస్టు సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఉడుపి పెజావర పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ గడిచిన కొన్ని రోజులుగా అయోధ్యలోనే ఉన్నారు. విగ్రహ ప్రతిష్ఠ వేళ గర్భగుడిలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబంతోపాటు పాల్గొన్నారు. మైసూరు రాజసంస్థానం యువరాజు యదువీర కృష్ణదత్త చామరాజ ఒడయార్, యువరాణి త్రిషికా కుమారి పాల్గొన్నారు. ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ, ప్రముఖ క్రికెటర్ అనిల్ కుంబ్లే, ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ విభాగం సహసంచాలకుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.



అయోధ్యలో మైసూరు యువరాజు యదువీర కృష్ణ దత్త చామరాజ ఒడయార్, యువరాణి త్రిషికా కుమారి

## మా ఊళ్లో రాముడి గుడి కట్టించా

● నేను నాస్తికుడిని కాను.. ఆస్తికుడిని
● అమానుష పనులు చేసి దేవుడి ముందు నాటకాలు కుదరవు : సీఎం సిద్దరామయ్య

మహదేవపుర, జనవరి 22: 'నేను గొప్ప ఆస్తికుడిని.. నాస్తికుడిని కాను.. మా ఊరిలో శ్రీరామచంద్రుడికి గుడి కట్టించాను. అక్కడ నిత్యపూజలు జరుగుతున్నాయి..' అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెంగళూరు బిదరహళ్లి సమీపంలోని హిరండహళ్లి శ్రీరామటెంపుల్ ట్రస్టు నిర్మించిన సీతారామలక్ష్మణ ఆలయాన్ని సోమవారం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా 33 అడుగుల ఎత్తైన ఏకశిలా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రారంభించి మహాకుంభాభిషేకంలో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా హాజరైన సీఎం పూజల అనంతరం ప్రసంగిస్తూ అధర్మం, అమానుషమైన పనులు చేస్తూ దేవుడి ముందు కుప్పిగంతులు వేస్తే అలాంటి పూజలు భగవంతుడు అంగీకరించడని తెలిపారు. సకల జీవరాశి సమానమని, ప్రేమ అప్యాయతలతో జీవించాలని ఆదర్శపురుషుడైన శ్రీరాముడి ఆశయమన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాలలోనూ రామాలయాలు ఉన్నాయని చెప్పారు. ఏ మతమైనా సాటి మనుషులను ద్వేషించాలని చెప్పదని అన్నారు. శ్రీరామచంద్రుడు సమాజంలో అన్ని వర్గాల ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షించారని పేర్కొన్నారు. జై శ్రీరామ్ అనేది ఎవరి ప్రైవేట్ సొత్తు కాదని, దేశంలోని రామభక్తులందరి సొత్తు అని సీఎం అన్నారు. మాజీ మంత్రి అరవింద లింబావళి ప్రసంగిస్తూ తన పేరులోనే రాముడిని పొందు పరుచుకున్న ముఖ్యమంత్రి ఇక్కడి రామాలయం ప్రారంభానికి విచ్చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రులు బైరతి సురేశ్, ఈశ్వర్‌ఖండ్రె, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎంవీ రాజుగౌడ, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజుపాటు స్థానిక ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి, మాజీ మంత్రి హెచ్‌ఎం రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.



భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం సిద్దరామయ్య



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం సిద్దరామయ్య, వేదికపై మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

## శివమొగ్గలో మహిళ, గదగ్‌లో యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేళ శివమొగ్గలోని శివప్పనాయక్ సర్కిల్లో శ్రీరామసేన కార్యకర్తలు, ఓ ముస్లిం మహిళ మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీరామసేన కార్యకర్తలు జై శ్రీరామ్ నినాదాలు చేయగా ఆమె అల్లా అంటూ నినాదాలు చేశారు. దీంతో వివాదం చోటు చేసుకోగా ఆమె ప్రధాని నరేంద్రమోదీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె మానసిక పరిస్థితి సరిగాలేదని ఎస్పీ మిథున్‌కుమార్ వెల్లడించారు. కాగా గదగ్‌లో రామమందిరంపై పాకిస్థాన్ జెండా రూపొందించి సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టింగ్ చేసిన మేరకు గజేంద్రఘడ్ పట్టణానికి చెందిన తౌజుద్దీన్ దఫేదార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మత ఘర్షణలకు ఇటువంటి సంఘటనలే కారణమని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి.



కొళ్లేగాలలో రామాలయం ప్రారంభంలో పారిశ్రామికవేత్త సునితా తిమ్మేగౌడ



బీజేపీ కార్యాలయం వద్ద దీపోత్సవంలో విజయేంద్ర తదితరులు

## రాజధాని కాషాయ మయం

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేళ రాజధాని బెంగళూరు నగరంలోని అన్ని రామమందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు ఇతర ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. బెంగళూరు వయ్యాలికావల్‌లోని టీడీడీ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. నగర వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లు, శ్రీరాముడి చిత్రంతో కూడిన కాషాయ జెండాలతో ఆకర్షణీయంగా కనిపించాయి. పలువురు భక్తులు తమ వాహనాలపై జైశ్రీరామ్ నినాదంతో ఉన్న జెండాలను అలంకరించుకున్నారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, శ్రీరామసేన వంటి హిందూ సంస్థలతోపాటు అనేక ధార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఎక్కడికక్కడే శ్రీరామచంద్రుడి పెద్దపెద్ద కటౌట్‌లను ఏర్పాటు చేశాయి. సీతారామలక్ష్మణ ఆంజనేయ సమేత ఫొటోలను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు. పలుచోట్ల శ్రీరామనవమిని తలపించేలా వడపప్పు, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. అడుగడుగునా భక్తులు రామనామం జపిస్తూ పరవశించారు. పలుచోట్ల భజనలు నిర్వహించారు. కేంద్రప్రభుత్వ సంస్థలు సగం రోజు సెలవు కాగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేసినా హాజరు అంతంతమాత్రమే కనిపించింది. కాగా నగరంలోని అనేక ప్రముఖ ఆలయాలను బీజేపీ నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు తదితరులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నగరవ్యాప్తంగా పోలీసులు అన్ని సమస్యాత్మక ప్రాంతాల్లోనూ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అన్ని ప్రముఖ ఆలయాల వద్ద ముందుజాగ్రత్తగా బలగాలను మొహరింపచేశారు. మొత్తమ్మీద రాజధాని నగరం కాషాయమయంగా మారి భక్తుల రామనామస్మరణతో మారుమోగింది. అవెన్యూరోడ్డు, బీవీకే అయ్యంగార్ రోడ్డు సహా పలు ప్రముఖ ప్రాంతాలలో వందలాది దుకాణాలు మధ్యాహ్నం దాకా స్వచ్ఛందంగా మూసివేశారు. ఎంపీ తేజస్వి సూర్య ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో పలువురు చిన్నారులు సీతారామ లక్ష్మణ ఆంజనేయ వేషధారణ ఉత్సాహంగా సాగింది. కొన్ని చోట్ల ఈ చిన్నారులనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షామియానాల కింద వరుసగా కూర్చోబెట్టారు.



సీతారామ లక్ష్మణ వేషాల్లో చిన్నారులు

## అయోధ్య తరహాలో అంజనాద్రిని అభివృద్ధి చేయాలి

● మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామజన్మభూమి తరహాలోనే రాష్ట్రంలోని ఆంజనేయస్వామి జన్మస్థలమైన అంజనాద్రిని కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సూచించారు. అయోధ్యలో రామమందిరంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఆయన బెంగళూరు బాలబ్రూయి గెస్ట్‌హౌస్ సమీపంలోని మారుతి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె. గోపాలయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం బొమ్మై మీడియాతో మాట్లాడుతూ దేశంలో రామరాజ్య స్థాపనే తమ తదుపరి లక్ష్యమన్నారు. రామమందిర ప్రారంభంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు భక్తి భావంతో పులకించారని, ప్రపంచ వ్యాప్తంగా హిందువులు పరవశించారని అన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ సీఎం బొమ్మై

## రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 5.37 కోట్లు

● అత్యధికంగా బెంగళూరు దక్షిణలో 7,17,201 ఓట్లు
● అత్యల్పంగా శృంగేరిలో 1,67,556 ఓట్లు
● ఓటర్ల తుదిజాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం



ఓటరు జాబితా విడుదల చేస్తున్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా తదితరులు

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొత్తం 5.37 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా ప్రకటించారు. 2024 సంవత్సరానికి సంబంధించిన ఓటర్ల తుది జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేశామన్నారు. మొత్తం 5,37,85,815 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,69,33,750 మంది పురుషులు, 2,68,47,145 మంది మహిళలు ఉన్నారు. కాగా హిజ్డా ఓటర్ల సంఖ్య 4,920గా ఉందన్నారు. వీరిలో తాజాగా జాబితాలో 3,88,527 మంది యువ ఓటర్లు చేరారని వెల్లడించారు. వీరు మొదటిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోబోతోన్నారని చెప్పారు. 80 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 12,71,862 కాగా 100 ఏళ్లు పూర్తి చేసుకున్న ఓటర్ల సంఖ్య 17,937గా ఉందన్నారు. దివ్యాంగ ఓటర్లు 5,62,890గా ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఓటర్ల సంఖ్య 4,08,653 పెరిగిందన్నారు. ఇందులో మహిళా ఓటర్ల సంఖ్య 2.77లక్షలుగాను, పురుష ఓటర్ల సంఖ్య 1.30 లక్షలుగా ఉందన్నారు. రాష్ట్రంలోని 224 శాసనసభ నియోజకవర్గాలకు గాను బెంగళూరు నగర జిల్లా పరిధిలోని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం 7,17,201 ఓటర్లతో అతిపెద్ద నియోజకవర్గంగా ఉందన్నారు. చిక్కమగళూరు జిల్లాలోని శృంగేరి నియోజకవర్గం 1,67,556 ఓట్లతో అతి చిన్న నియోజకవర్గంగా ఉందన్నారు. ఓటర్ల జాబితాలో ఫొటోలు, చిరునామాలలో వ్యత్యాసాలను వందశాతం సరిదిద్దామన్నారు. ఓటర్ల గుర్తింపుకార్డులను సులభతరంగా పొందే అవకాశం కల్పించామన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం మొత్తం 28 నియోజకవర్గాలలో 58,834 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. గతంతో పోలిస్తే పోలింగ్‌బూత్‌ల సంఖ్య 552 పెరగనుందన్నారు. మీడియా సమావేశంలో అడిషినల్ చీఫ్ ఎలెక్షన్ ఆఫీసర్లు వెంకటేశ్ కుమార్, కూర్మారావు పాల్గొన్నారు. అంతకుముందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం అధికారులు చర్చలు జరిపారు. కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్‌తోపాటు ఆప్, బహుజన సమాజ్ పార్టీ, సీపీఐ, సీపీఎం ప్రతినిధులు హాజరయ్యారు.



అలంకరణలో అభయాంజనేయుడు



కురేకుప్పలో..



సంగమేశ్వర ఆలయంలో శ్రీరామ భజన

# ॥ జై శ్రీరామ్ ॥

**బళ్లారి సిటీ/రూరల్/సిరుగుప్ప/తోరణగల్లు/కంప్లి, జనవరి 22:** అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామ నామస్మరణ మార్మోగింది. ఆలయాలు, కూడళ్లలో కా షాయజెండా రెపరెపలాడింది. సోమవారం తెల్లవారుజామునుంచే రామభజన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు బాలరాముడి ప్రతిష్ఠను టీవీల్లో వీక్షించిన ప్రజలు స్వామికి హారతులిచ్చి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. నగరం ఊరేగింపులు, ర్యాలీలతో శోభాయామానంగా మారింది.



కంప్లిలో అక్షింతలతో శ్రీరామ, ఆంజనేయ స్వామి చిత్రాలు గీసిన పూజాభరత్



బళ్లారి విఠల కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు



నారాయణ స్వామి క్యాంపు కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు





తాళూరురోడ్డులో...



పరమదేవనహళ్లిలో పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టిన యువకులు, గ్రామస్థులు







అంజనాద్రి పై హనుమంతుడికి అలంకరణ, హోమాలు..



ఇంటి ముందు దీపాలు వెలిగిస్తూ..



వెంకటేశ్వరుడి ఆలయంలో..




కంప్లిలో ఆకట్టుకున్న అయోధ్య ఆలయం ముగ్గు









సిరుగుప్పలో ప్రసాదం పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, రాయచూరులో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ , రామలక్ష్మణసీత వేషధారణలో స్వామివివేకానంద విద్యార్థులు, కొత్త నెల్లూడి పూజలు చేస్తున్న గ్రామస్థులు

## ఆటోను ఢీకొన్న లారీ

● మహిళమృతి ● ఐదుగురికి గాయాలు



మృతిచెందిన శిరీష (ఫైల్)



గాయపడిన హరీష్



తల్లిని కోల్పోయిన చిన్నారులు

**పెనుకొండ రూరల్, జనవరి 22 :** గూడ్స్ ఆటోను లారీ ఢీ కొనడంతో మహిళ మృతి చెందడంతో పాటు ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ శ్రీ కృష్ణదేవరాయల జైజంక్షన్ 44 వ జాతీయరహదారిలో గుర్తుతెలియని లారీ గూడ్స్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటక వాసి శిరీష(26) మృతిచెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. పావగడ తాలూకా పలవల్లికి చెందిన హరీష్, భార్య శిరీష, కుటుంబ సభ్యులు కలిసి కొన్నేళ్లుగా రికార్డింగ్ డ్యాన్స్‌లు, వీధి నాటకాలు ప్రదర్శిస్తూ కుటుంబపోషణ చేసుకునేవారు. ఆదివారం రాత్రి మండలంలోని గోనిపేటలో రికార్డింగ్ డ్యాన్స్ ముగించుకుని గూడ్స్ ఆటోలో తిరిగి పెనుకొండకు వస్తుండగా శ్రీకృష్ణదేవరాల సర్కిల్ వద్ద మలుపు తిరుగుతుండగా గుర్తుతెలియని లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శిరీష అక్కడికక్కడే మృతిచెందగా భర్త హరీష్, కుమారులు విక్కీ, జోసఫ్, కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల నిమిత్తం మెరుగైన వైద్యం కోసం హరీష్‌ను తుమకూరుకు తరలించారు. తల్లి మృతితో చిన్నారులు బోరున విలపించారు. తల్లి మృతితో అనాథలైన పిల్లలను చూసిన వారు కంట తడి పెట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అసమానతలను ప్రశ్నించిన అంబిగర: మేయర్

**బళ్లారి సిటీ, జనవరి 22:** సమాజంలో అసమానతలను ప్రశ్నించిన మహనీయుడు అంబిగర చౌడయ్య అని, పన్నెండవ శతాబ్దంలో శివశరణుల మధ్య దేదీప్యమానంగా ప్రకాశించి చెప్పినట్లే నడిచిన వ్యక్తి అని మహానగర పాలికె మేయర్ శ్వేత పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని బీడీఏ ఫుట్‌బాల్ మైదానంలోని హాల్లో జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహనగర కార్పోరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంబిగర చౌడయ్య చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలోని వివక్షా విధానానికి వ్యతిరేకంగా పోరాడి నూతన వ్యవస్థకు సైద్ధాంతిక పునాదిని కాపాడిన వ్యక్తి అంబిగర చౌడయ్య అన్నారు. సమాజంలోని అనైతికతను ఆయన విమర్శించారు. తన పద్యాలను హేతుబద్ధంగా అవిష్కరిస్తూ గొప్ప మానవతావాది అన్నారు. రచయిత తిప్పేస్వామి మాట్లాడుతూ అంబిగర చౌడయ్య 12వ శతాబ్దానికి చెందిన బసవన్న అనుచరుడు. గురువైన బసవన్నతో కలిసి వేలాది సంత్సరాలుగా జనంలో ఉన్న మతం, దేవుళ్లపై ఉన్న మూఢనమ్మకాలన్నింటినీ నాశనం చేశారన్నారు. అంబిగ అంటే పడవ నడిపే వాడని, అంబిగర చౌడయ్య అనే కలం పేరుతో దాదాపు 278 వచనాలను రచించారన్నారు. ఎం.నాగభూషణ్ సంకీర్తనలు ఆలపించారు. ఈసందర్భంగా గంగమాత సమాజం నాయకులు, డిప్యూటీ మేయర్ జానకి, అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేరా, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు పాల్గొన్నారు. నగరంలోని దుర్గమ్మ దేవాలయం నుంచి జరిగిన శోభయాత్రలో మహిళలు పూర్ణకుంభాలతో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ శ్వేత

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దళితసంఘర్ష సమితి సభ్యులు

**బళ్లారి సిటీ, జనవరి 22:** కర్ణాటక దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. సోమవారం నగరంలోని కెంచప్ప ప్రభుత్వ పా ఠశాలలో సీఎస్ రఘు బృందం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ సావిత్రి బాపూలే, జ్యోతిబాపూలే వంటి వారి గొప్పవ్యక్తుల గాథలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. పాఠశాల పాలకవర్గం, ప్రధానోపాధ్యాయులు, సంఘం జిల్లాకోశాధికారి నగేశ్, నాగరాజు, బుడా మాజీ అధ్యక్షుడు వినోద్ కుమార్, శంకర్, కుమార్, చెన్నప్ప సంఘం సభ్యులు పాల్గొన్నారు.


## ఆసుపత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్ : డీహెచ్ఓ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీ హెచ్ఓ రమేశ్‌బాబు

**బళ్లారి సిటీ, జనవరి 22:** దంపతులు మూడు నెలలకోసారి తీసుకోవాల్సిన 'ఇంటర్వెల్' ఇంజక్షన్ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉందని కుటుంబ సంక్షేమాధికారి(డీహెచ్ఓ) డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. సోమవారం జిల్లా ఆరోగ్య కుటుంబ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న కుటుంబాన్ని కలిగి ఉండటం చాలా అవసరమని, ఆరోగ్యశాఖ అందించే కుటుంబ నియంత్రణ పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కుటుంబ సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమనె మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 2,405 మంది మహిళలు గర్భాశయ ఇంజెక్షన్లను ఉపయోగించే జంటలు ఏవైనా సమస్యలుంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులతో సలహాలు పొందవచ్చన్నారు. శిక్షకులు డాక్టర్ కావ్యశ్రీ, డాక్టర్ దివ్య, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దానప్పనవర్, ప్రత్యేక వైద్యులు డాక్టర్ చైత్ర వర్దేకర్, డాక్టర్ పరిమళ దేశాయ్, ఆసియా బేగం, వైద్యాధికారలు హనుమంతప్ప, డాక్టర్ కరుణ, కుటుంబ సంక్షేమ శాఖ వైద్యాధికారులు గుప్తా, డాక్టర్ సురేఖ, గోపాల్, మల్లికార్జున పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

**సిరుగుప్ప, జనవరి 22 :** ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లింగరాజారెడ్డి కోరారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగరాజరెడ్డి మాట్లాడుతూ 6వ వేతనం జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, వేతనాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బీసన్న, కోశాధికారి ఇంజారప్ప, కార్యదర్శి హనుమంతప్ప, పరిశోధకులు వెంకటేష్, పదాధికారులు రవికుమార్, హనుమంతరెడ్డి, శ్రీధర పాల్గొన్నారు.

# హోసూరు జోన్

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**హోసూరు, జనవరి 22:** రాయకోట సబ్ స్టేషన్, సిప్‌కాట్ ఫేజ్-2 సబ్ స్టేషన్‌లో అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనులు జరుగుతున్నందున ఈనెల 23న మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. రాయకోట, ఒన్నంపట్టి, ఎచ్చంపట్టి, పీ అగ్రహారం, లింగంపట్టి, కడుమంజూర్ పుదుపట్టి, మొగలూరు, కొప్పక్కరై, దేవనంపట్టి, కిట్టమ్‌పట్టి, పెట్టంపట్టి, వెప్పలంపట్టి, లక్ష్మీపురం, టీ పల్లి, ఎస్ఎస్ హళ్ళి, ముత్తంపట్టి, దిన్నూరు, కరుక్కనహళ్లి పరిసర ప్రాంతాలలో విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు. సిప్‌కాట్ ఏరియా ఫేజ్ 2, బత్తలపల్లి, పెన్నమటం, ఎలక్ట్రానిక్ ఎస్టేట్, కుముదేపల్లి, మోర్నపల్లి, ఏ శామనపల్లి, ఆలూరు, బుక్కసాగరం, అదియమాన్ కళాశాల, కదిరేపల్లి, మారుతీనగర్, పేరండపల్లి, రామచంద్రం, సుండట్టి, అంకేపల్లి ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

## ఆలయాల్లో విశేష పూజలు

● మార్కెట్‌లో 5వేల మందికి అన్నదానం

**హోసూరు, జనవరి 22:** అయోధ్యలో శ్రీరామమందిర ప్రారంభం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం నేపథ్యంలో హోసూరులోని పలు ఆలయాలలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. రామ నామ జపాలు జపిస్తూ పూజల్లో పాల్గొన్నారు. కాగా హోసూరు బత్తలపల్లి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, రైతుల తరపున శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూను ప్రసాదంగా పంపిణీ చేసి సుమారు 5వేల మందికి అన్నదా నం నిర్వహించారు. అలాగే సమీపంలోని గోపసంద్రంలో వెలసిన దక్షిణ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో 50 మంది వేద పండితులు సోమవారం వేకువజామున 4 గంటలకు రామకోటి నామజపం చేపట్టారు. లోకకల్యా ణం కోసం సుమారు 28 గంటల పాటు పారాయణ ఉంటుందన్నారు. మంగళవారం 10గంటల వరకు కొనసాగుతుందన్నారు.



దక్షిణ తిరుపతి వెంకటేశ్వరస్వామి మూల విరాట్

## బీజేపీ తీరుపై కాంగ్రెస్ నిరసన

**హోసూరు(సిప్‌కాట్) జనవరి 22:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్‌యాత్ర అస్సోంలో సోమవారం జరిగింది. ఉదయం అక్కడి ఆలయాన్ని సందర్శించాల్సి ఉండగా బీజేపీ కార్యకర్తలు కొందరు అడ్డుకున్నారు. దీన్ని ఖండిస్తూ బీజేపీ తీరును తప్పుబట్టారు. హోసూరు పశ్చిమజిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్ అధ్యక్షత వహించారు. నిరసనలో మున్సిపల్ అధ్యక్షుడు త్యాగరాజన్, మునిరాజ్, కీర్తి గణేశ్, హరీష్, శ్రీనివాసన్, ముత్తప్ప, సహ జిల్లా ప్రాంతీయ మున్సిపల్ మహిళలు, మైనార్టీ మానవ హక్కుల విభాగం, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మీడియా సెల్, విద్యార్థి విభాగం తదితర విభాగాల సభ్యులు పాల్గొన్నారు.



నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## ఘనంగా టీవీఎస్ వార్షికోత్సవం

**హోసూరు(సిప్‌కాట్) జనవరి 22:** ప్రముఖ వాహనాల తయారీ సంస్థ టీవీఎస్ 40వ వార్షికోత్సవం హోసూరు అందివాడిలో సోమవారం ఘనంగా జరిగింది. సంస్థ యజమాని వేణు శ్రీనివాసన్, ఎండీ సుదర్శన్ వేణు జ్యోతి ప్రజ్వలన చేశారు. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్, డైరెక్టర్ కెఎన్ రాధాకృష్ణన్, ఆర్.కుప్పుస్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎండీ సుదర్శన్ వేణు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ దశ పోరాటాల ద్వారా టీవీఎస్ కంపెనీ ఈ స్థాయికి ఎదిగిందన్నారు. కార్మికులు ఒక కుటుంబంలా పని చేయడంతోనే సంస్థ ఎదుగుదలకు ముఖ్య కారణమన్నారు. ప్రస్తుతం టివిఎస్ కంపెనీ దేశంలోనే కాకుండా 55 దేశాలకు ఎగుమతి చేస్తోందన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మూడు చక్రాల వాహనాలను అందిస్తోందన్నారు. ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు, ఆటోల వంటి మూడు చక్రాల వాహనాల ఉత్పత్తిల్లో మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని, వినియోగదారుల అవసరాలు తెలుసుకుని, డిజిటల్ సెంటర్, ఆధునిక సాంకేతిక వాహనాలను తయారు చేస్తున్నామని తెలిపారు. టీవీఎస్ సంస్థ యూనియన్ అధ్యక్షుడు ఆర్ కుప్పుస్వామి మాట్లాడుతూ ఈ సంస్థ 1977లో ఏర్పాటైందని 1980 ల్లో ద్విచక్ర వాహనాల ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. తొలుత 100 వాహనాలను నెల రోజుల్లో ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా మూడు నెలల సమయం పట్టిందన్నారు. ద్విచక్ర వాహనాల తయారీకి జాతీయ అవార్డును 3 సార్లు గెలుచుకుందన్నారు. చైర్మెన్ వేణు శ్రీనివాసన్ మాట్లాడుతూ కార్మికులను ఎప్పుడు కార్మికుల్లా కాకుండా సోదరుల్లా చూశామని అందుకే సంస్థ ఈస్థాయికి ఎదిగిందన్నారు. అనంతరం కామరాజ్ కాలనీలోని కామరాజర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.




కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న టీవీఎస్ యజమాని వేణుశ్రీనివాసన్

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### నేతాజీ సుభాష్‌చంద్రబోస్ (జయంతి)




స్వాతంత్ర్య సమరయోధుడు 'నేతాజీ' సుభాష్ చంద్రబోస్ 1897 జనవరి 23న ఒడిశా రాష్ట్రం కటక్‌లో జన్మించారు. సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమి కొట్ట వచ్చునని నమ్మి ఆచరించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీజీతో సిద్ధాంతపరమైన విభేదాలతో పదవికి రాజీనామా చేశారు. రెండో ప్రపంచయుద్ధంలో ఆంగ్లేయులను ఎదుర్కొనేందుకు జపాన్ సహకారంతో ఖైదీ లు, రబ్బరు తోటల కూలీలు, ఔత్సాహికులతో 'ఆజాద్ హింద్ ఫౌజ్' ను ఏర్పాటు చేశారు. 'మీ రక్తాన్ని ధార పోయండి... మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అనే ఆయన నినాదం ఎంతో పేరొందింది. 1945 ఆగస్టు 18న విమాన ప్రమాదంలో కన్నుమూశారు.

### వావిలికొలను సుబ్బారావు (జయంతి)



ప్రముఖ రచయిత, గ్రాంథిక వాది వావిలికొలను సుబ్బారావు 1863 జనవరి 23న కడపలో జన్మించారు. కందుకూరి వీరేశలింగం పంతులు తర్వాత మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా పని చేశారు. భక్తి సంజీవని మాస పత్రిక సంపాదకులు. ధర్మసమాజాన్ని స్థాపించారు. సంస్కృతంలోని రామాయణాన్ని 'మందరం' పేరిట ఆంధ్రీకరించి 'ఆంధ్ర వాల్మీకి'గా పేరొందారు. 1920లో సన్యాస దీక్ష స్వీకరించి ఆంధ్ర రాష్ట్రమంతటా పర్యటించారు. ఒంటిమిట్టలోని కోదండ రామాలయాన్ని పునరుద్ధరించడానికి ఎంతో కృషి చేశారు. 1936 ఆగస్టు 1న కన్నుమూశారు.

### రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ (జయంతి)



శాస్త్రీయమైన సాహితీ విమర్శకు కళాత్మకమైన రూపురేఖలు దిద్దిన అనంతకృష్ణ శర్మ 1893 జనవరి 23న అనంతపురం జిల్లా రాళ్ళపల్లిలో జన్మించారు. అన్నమాచార్యుల కృతులను ఆయన స్వర పరచి తెలుగువారికి అందించారు. వేమనపై సాధికారమైన విమర్శ గ్రంథాన్ని వెలువరించారు. సంగీత, సాహిత్యాలు రెండింటిలోనూ సమస్కందులు. మైసూరు మహారాజా కళాశాలలో 38ఏళ్ల పాటు అధ్యాపకుడిగా వ్యవహరించారు. రేడియోకు ఆకాశవాణి అని పేరుపెట్టింది ఆయనే. గాన కళాసింధు, సంగీత కళారత్న పురస్కారాలు పొందారు. 1979 మార్చి 11న కన్నుమూశారు.

### ఖాసా సుబ్బారావు (జయంతి)



దేశంలో పేరొందిన పత్రికా సంపాదకులలో ఒకరైన ఖాసా సుబ్బారావు 1896 జనవరి 23న నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో జన్మించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ శిష్యులలో ఒకరు. టంగుటూరు ప్రకాశం ఆధ్వ ర్యంలో మద్రాస్‌లోని 'స్వరాజ్య' ఆంగ్ల దినపత్రికలో ఉప సంపాదకులుగా పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. అనంతరం 'స్వతంత్ర' పత్రికను ఏర్పాటు చేశారు. 1961 జూన్ 16న కన్నుమూశారు.

### బాల్ థాకరే (జయంతి)



బాలాసాహెబ్ ఠాకరే (బాల్ ఠాక్రే) 1926 జనవరి 23న జన్మించారు. మహారాష్ట్ర రాజకీయాలనే కాక దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి. మరాఠా హక్కుల సాధనకై శివసేన పార్టీని ఏర్పాటు చేశారు. హిందుత్వాను, హిందూ జాతీయవాదాన్ని కూడా బలపరిచారు. కార్టూనిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. 1995లో శివసేన అధికారంలోకి వచ్చినా ఆయన మాత్రం ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు, ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2012 నవంబరు 17న కన్నుమూశారు.

### సిద్ధేశ్వరానంద భారతి స్వామి (పుట్టినరోజు)



కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి 1937 జనవరి 23న ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరులో జన్మించారు. 2002 నుంచి పీఠాధిపతిగా కొనసాగుతున్నారు. డాక్టర్ ప్రసాదరాయ కులపతి (వెంకట లక్ష్మీ వరప్రసాదరావు)గా చిర పరిచితులు. ముత్తాత రామకవి నుంచి కుస్తీ పద్ధతుల తోపాటు కవితా ప్రతిభను వారసత్వంగా పొందారు. తెలుగు సాహిత్యంలో అవధాని, ఆసుకవి, వక్త, భువన విజయం వంటి సాహిత్య నాటకాల నిర్వాహకుడిగా పేరొందారు. శివ సహస్రి, అంబికా సహస్రి వంటి కవితలు ఎంతో పేరొందాయి. అవధాన సరస్వతి, సరస్వతీ కాంత ఆభరణ, కవితా సుధాకర తదితర బిరుదులు పొందారు.

### రమేశ్ సిప్పి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత రమేశ్ సిప్పి 1947 జనవరి 23న కరాచీలో జన్మించారు. సినీ దర్శకుడు, నిర్మాత. ఆయన దర్శకత్వం వహించిన 'షోలే' సినిమా ఎంతో పేరొందింది. ముంబైలో సొంత సినీ అకాడమీ ఏర్పాటు చేశారు. పలు బుల్లితెర సీరియల్స్‌కు దర్శకత్వం వహించారు. 2020లో ఫిల్మ్‌ఫేర్ జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. ఆయన కుమారుడు రోహన్ సిప్పి కూడా దర్శకుడిగా రాణిస్తున్నారు.

భారత్ భ్రమలు- వాస్తవాలు అనే అంశంపై

## రేపు నగరంలో సదస్సు

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 2014 అనంతరం భారతదేశం భ్రమలు, వాస్తవాలు అనే అంశంపై ఈనెల 24న ప్రత్యేక సదస్సు ఏర్పాటవుతోంది. జాగృత కర్ణాటక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ భవన్‌లో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సును ఉద్దేశించి ప్రముఖ రాజకీయ అర్థిక నిపుణుడు పరకాల ప్రభాకర్ ప్రసంగించనున్నారు. ఈ మేరకు నగరంలో సోమవారం ఒక ప్రకటన విడులైంది.

# ఆదర్శ పురుషుడు శ్రీరాముడు

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** దేశ ప్రజలందరికి శ్రీరామచంద్రుడు ఆదర్శపురుషుడని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య పేర్కొన్నారు. అయోధ్యలోని రామమందిరంలో సోమవారం విగ్రహ ప్రతిష్టాన జరిగిన సందర్భంగా ఆయన చిక్క బళ్ళాపురలోని పలు ఆలయాలలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని శ్రీరామచంద్రుణ్ణి ప్రార్థించినట్లు చెప్పారు. సత్య నిష్ఠ, పితృ వాక్యపాలనతో శ్రీరాముడు ఉత్తమ పాలన అందించారన్నారు. తొలుత రక్షారామయ్య చిక్కబళ్ళాపురం తాలుకా లోని ఎస్ఎస్ఎస్ దేవస్థానం, సర్ఎంవి.స్టేడియం వద్ద తోటలోని హనుమంతుడి విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం బలమురి సర్కిల్‌లో భక్తులకు ప్రసాదాన్ని వినిమయం చేశారు.

### బాణసవాడి అయ్యప్ప ఆలయంలో...

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాణసవాడిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మునిరాజ్, ఉపాధ్యక్షుడు జీ మోహన్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప, జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఇదే సంద్భంగా 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు సూరియన్, ఎన్.రవి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు. ఇదే సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

### శిడ్లఘట్టలో విశేష పూజలు

**శిడ్లఘట్ట:** అయోధ్యలో రామమందిరం ప్రారంభం నేపథ్యంలో పట్టణంలోని కోటె సర్కిల్‌లోగల శ్రీరామ మందిరంలో సోమవారం మధ్యాహ్నం విశేషపూజలు నిర్వహించారు. తాలూకాలోని పలు ఆలయాలలో ఉదయం నుంచి సాయంత్రం దాకా ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. అయోధ్య రామమందిర నమూనా ఏర్పాటు చేయడం తోపాటు శ్రీరాముడి విగ్రహాన్ని కొలువుదీర్చారు. దేశ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని పలువురు అభిప్రాయపడ్డారు. పలు చోట్ల రామాయణ చరిత్రను తెలిపే సన్నివేశాలు ప్రదర్శించారు. స్వామివారికి విశేషపూజలు, పుష్పాలంకరణ, ధూప దీప నైవేద్యాల అనంతరం మహా మంగళారతి సమర్పించారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పానకం, మజ్జిగ, పెసర బేడలు, అందచేసి అన్నదాసోహం నిర్వహించారు. యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలు కూడళ్ల లో కాషాయ కండువాలు ధరించి 'జై శ్రీరామ్' అంటూ భక్తిపూర్వకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మేలూరు బీఎస్ రవికుమార్, మాజీ మంత్రి వీ మునియప్ప, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, బీజేపీ నాయకులు సీకల్ రామచంద్రగౌడ, సమాజ సేవకుడు పుట్టు ఆంజనప్ప, కాంగ్రెస్ నాయకుడు బీకే వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### అయోధ్యలో నిఖిల్ బర్త్‌డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నిఖిల్, చిత్రంలో దేవెగౌడ దంపతులు

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనేందుకు జేడీఎస్ జాతీయ అధ్యక్షులు, మాజీ ప్రధాని దేవేగౌడ వెళ్ళిన సందర్భంలోనే మనవడు నిఖిల్ బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. బెంగళూరు నుంచి అయోధ్యకు మాజీ ప్రధాని దేవేగౌడ, భార్య చెన్నమ్మ, కుమారుడు కుమారస్వామి, మనవడు నిఖిల్‌లు ఆదివారం వెళ్ళారు. సోమవారం నిఖిల్ జన్మదినం కావడంతో అయోధ్యలో తాత దేవేగౌడ, తండ్రి కుమారస్వామిల సమక్షంలోనే కేక్ కట్‌చేసి వేడుకలు చేసుకున్నారు. ఇదే సందర్భంలో అవ్వాతాతల ఆశీర్వాదం పొందారు. సదరు ఫోటోలు, వీడియోలను ఎక్స్ ద్వారా పంచుకున్నారు.

### చింతామణిలో శ్రీరామ సందడి

**చింతామణి:** అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠాపన నేపథ్యంలో చింతామణి పట్టణం సహా గ్రామీణ ప్రాంతాలు, లే అవుట్‌లు, ఆలయ ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించబడ్డాయి. ఎటుచూసినా రంగ వల్లులతో ముస్తాబు చేశారు. పలు రహదారులు కాషా యమయం అయ్యాయి. బంటింగ్స్, జెండాలతో రారా జిల్లాయి. ప్రముఖ కూడళ్లలో శ్రీరాముడి బ్యానర్‌లు, కటౌ ట్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి ఆజాద్‌చౌక్, తహసీల్దార్ సర్కిళ్లలో ఏర్పాటైన శ్రీరాముడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్ష ణీయంగా నిలిచాయి. యువత, పెద్దలు సైతం కాషాయ శాలువాలు ధరించారు. వాహనాలను జైశ్రీరామ్ నినాదం కల్గిన జెండాలతో అలంకరించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల లడ్డూలను వివిధ సంఘాల సహకారంతో పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

### ఆలయాల్లో..

**బంగారపేట:** అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠాపన వేళ దేవదాయశాఖ పరిధిలోని అన్ని ఆలయాలలో విశేష పూజలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం పలు కార్యక్రమాలు సాగాయి. పట్టణంలోని కోదండ రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పాల్గొన్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠాపన ధార్మిక కార్యక్రమమని, బీజేపీ కార్యక్రమం కాదన్నారు. దేశంలో ప్రతి ఒక్కరూ శ్రీరాముడంటే అభిమానం చూపుతారన్నారు. శ్రీరామనవమి ఆచరించడం, రామభజన వంటివి మాకు కూడా తెలుసునన్నారు. బీజేపీ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మేస్త్రి శ్రీనివాస్, పిచ్చహళ్ళి గోవిందరాజు, గోపాలరెడ్డి, రామయ్య, మహదేవప్ప, చందు, మంజునాథ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదాన్ని అందిస్తున్న రక్షారామయ్య



బాణసవాడిలో పాల్గొన్న ప్రముఖులు



కోలారు సర్కిల్లోని శ్రీరాముడి మండపం వద్ద సందడి

### చేళూరు తాలూకాలో...

**చేళూరు:** అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన సందర్భంగా తాలూకాలోని పలు ఆలయాలలో శ్రీరాముడికి విశేష పూజలు జరిగాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకించి సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను పుర వీధులలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తుల 'జై శ్రీరామ్' నినాదాలు మారుమోగాయి. గ్రామస్థులంతా పాల్గొనడం వల్ల పండుగ వాతావరణం నెలకొంది. అన్ని ఆలయాల వద్ద భక్తుల సందడి కొనసాగింది.

### హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో...

**బొమ్మనహళ్ళి:** హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని అగరలో సోమవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడు కటౌట్‌ను గరుత్మంతుడు, ఆంజనేయ నమూనాలతో కూడిన వాహనాన్ని పురవీధులలో ఊరేగించారు. అగర ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని వాజ్‌పేయ్ క్రీడా మైదానం వరకు ఊరేగింపు సాగింది. హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు సునిల్ తదితరులు పాల్గొన్నారు.

### బాగేపల్లిలో...

**బాగేపల్లి:** శ్రీరాముడి గుణగణాలను మనం కూడా మన జీవితంలో అలవరుచుకోవడం ద్వారా ఉత్తమ జీవనాన్ని, విజయాన్ని అందుకోవాలని వాల్మీకి సామాజిక వర్గ ప్రముఖుడు గూళూరు బాబు అభిప్రాయపడ్డారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో పట్టణంలోని 1వ వార్డులోని అశ్వత్థకట్ట సమీపాన హిందూ, ముస్లింలు భావైక్యంగా శ్రీరామచంద్రుడి భావచిత్రానికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూళూరుబాబు మాట్లాడుతూ వీరత్వానికేకాక ఓర్పు, సహనం, దయ, మర్యాద వంటి వాటికి శ్రీరాముడు స్ఫూర్తిగా నిలిచారన్నారు. రామాయణంలోని పలు అంశాలను క్లుప్తంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో ప్రముఖులు గణేశ్, శంకరప్ప, కలీముల్లా, రాము, లక్ష్మణ, నాగరాజ్, అబ్బూ, చంద్రా, బాషా, అర్జున్, గులాబ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్‌చౌక్‌లో శ్రీరాముడి భారీ కటౌట్‌కు అలంకరణ





మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు



చేళూరులో విశేష పూజలు ఇలా..



అశ్వత్థకట్ట వద్ద ప్రసాదం పంపిణీ



మజ్జిగ, పానకం పంపిణీ

# వైద్య రంగ అనుబంధ ఏఐ పరిశోధనా సంస్థ ప్రారంభం

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సద్వినియోగంతో పరిశోధనలు జరిపేలా విజ్జి సంస్థ సరికొత్త కేంద్రాన్ని సోమవారం నగరంలో లాంఛనంగా ఆరంభించింది. కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ భాస్కర్‌రావ్ బొల్లినేని, అమెరికాకు చెందిన పీట్స్‌బర్గ్ వైద్యసంస్థ వీసీ డాక్టర్ అనంతశేఖర్‌లు భాగస్వాములయ్యారు. ఈసందర్భంగా విజ్జి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ జీవనశైలితో వచ్చే జబ్బులు నిర్వహణ వ్యక్తిగత చికిత్సా విధానం అభివృద్ధి చేసేలా కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంతో పరిశోధనలు జరుపదలచామన్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన ముంబై ఐఐటీ, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు పెట్టుబడుల ద్వారా సహకరించారన్నారు. సొంతప్రాంతం బళ్ళారి అయినందున రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలతో పాటు పరిశోధనల ద్వారా ఆధునిక సమాజానికి ఉత్తమ ఆరోగ్యం సాధ్యం చేయదలచామన్నారు. భవిష్యత్తులో 500ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించదలచినట్లు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలాంటి అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన రోజునే పరిశోధనా కేంద్రాన్ని ఆరంభించడాన్ని సంతోషంగా భావిస్తున్నామన్నారు.



పరిశోధనా సంస్థను ప్రారంభిస్తున్న ప్రముఖులు

## రూ.39 కోట్లతో రహదారి పనులు



భూమిపూజలో ఎంపీ బీఎన్ బచ్చేగౌడ, ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ తదితరులు

**హొస్కోటె, జనవరి 22:** రాష్ట్ర రహదారి 85 హొస్కోటె - చింతామణి రోడ్డును అప్ గ్రేడ్ చేయడం ద్వారా రూ.39కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ తెలిపారు. ఇందులో 26 కిలోమీటర్లు హొస్కోటెకు చెందగా మిగిలినది శిడ్లఘట్ట, చింతామణి ప్రాంతాలకు చేరుతుందన్నారు. హొస్కోటె-చింతామణి మార్గంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేయడమే ఉద్దేశ్యమన్నారు. హొస్కోటె పట్టణం సంతగేట్ వద్ద సోమవారం డాంబరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీ బీఎన్ బచ్చేగౌడ మాట్లాడుతూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరితో కలసి ఈ మార్గాన్ని చతుష్పథగా మార్చాలని ప్రస్తావించానన్నారు. బెంగళూరు - హొస్కోటె మార్గంగా ఆంధ్రప్రదేశ్‌లోని కడప, అక్కడ నుంచి అమరావతికి చేరుకునేలా చతుష్పథ మార్గం అనుకూలం కానుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బీఎన్ గోపాలగౌడ, బీవీ భైరేగౌడ, బీజీ నారాయణగౌడ, హాప్‌కామ్స్ డైరెక్టర్ ఎంబీ వెంకటేశప్ప, టీపీఎంఎస్ బాబురెడ్డి, మాతంగ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎం సుబ్బరాజ్, నగరసభ సభ్యులు కేశవ్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ అక్రమాలపై

## సీఎంకు నివేదిక సమర్పణ

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల అర్హతా పరీక్షల వేళ చోటుచేసుకున్న అక్రమాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీరప్ప సమగ్ర నివేదికను సీఎం సిద్దరామయ్యకు సమర్పించారు. సోమవారం సీఎం అధికారిక నివాసం కృష్ణలో నివేదికను సమర్పించారు. బీజేపీ ప్రభుత్వం సాగుతున్న వేళ 545 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకై జరిగిన అర్హతా పరీక్షలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కేసులో కీలక సూత్రధారులతో పాటు భాగస్వామ్యం కలిగిన పోలీసు అధికారులతో కలిపి 110ల మంది జైలుకెళ్ళి బెయిల్‌పై వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సదరు అక్రమాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి బీ వీరప్ప నేతృత్వంలో కమీషన్‌ను విచారణలు జరిపే బాధ్యతలు అప్పగించారు. సమగ్ర నివేదికను సీఎం సిద్దరామయ్యకు కమీషన్ ముఖ్యులు వీరప్ప సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం అదనపు ముఖ్య కార్యదర్శి ఎల్‌కె అతీక్ తదితరులు ఉన్నారు.



సీఎం సిద్దరామయ్యకు నివేదిక సమర్పిస్తున్న జస్టిస్ వీరప్ప

## తిరుపత్తూర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

▸▸ ఇద్దరు బెంగళూరు వాసుల సహా ముగ్గురి మృతి

**వేలూరు, జనవరి 22:** తిరుపత్తూర్ జిల్లా పచ్చకుప్పం పాలారు సమీపంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తల్లి, కొడుకు సహా ముగ్గురు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వేలూరు జిల్లా గుడియాత్తం సంతపేట ప్రాంతానికి చెందిన నగల కార్మికులు శరవణన్, శాంతి దంపతుల కుమారుడు మైత్రేయన్ (21). ధర్మపురిలోని బంధువుల ఇంటికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాయి. అలాగే, బెంగుళూరు నగరానికి చెందిన మాధవన్, ఆయన భార్య రోజా, కుమారులు కుమరేశన్, శివతో కలసి చెన్నై మనలి పార్థసారథి నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఆంబూరు పచ్చకుప్పం మార్గంగా వస్తున్న మాధవన్ ప్రయాణిస్తున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొని శరవణన్ కారును ఢీకొంది. ఈ ఘటనలో శరవణన్, రోజా, శివ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆంబూరు తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తిరుపత్తూర్ ఎస్పీ ఆల్బర్ట్ జాన్ పరిశీలించారు.



ఘటనలో నుజ్జునుజ్జయిన కార్లు

రామ్‌లల్లా విగ్రహం...

## బాలుడు లేచి వచ్చినట్టుంది

▸▸ శిల్పి అరుణ్ యోగిరాజ్ తల్లి సరస్వతి

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** అయోధ్య మందిరంలో ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహం చూస్తే బాలరాముడు లేచి వచ్చినట్టు ఉందని శిల్పి అరుణ్ యోగిరాజ్ తల్లి సరస్వతి హర్షం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనలు టీవీలలో కుటుంబ సభ్యులందరితో కలసి వీక్షించారు. సోమవారం మైసూరులో తల్లి సరస్వతి, యోగిరాజ్ భార్య విజేతలు మీడియాతో మాట్లాడారు. అయోధ్య మందిరంలో ప్రతిష్ఠాపన వీక్షించడం పూర్వజన్మ సుకృతంగా భావి స్తున్నామని, మా జీవితానికిది సంతృప్తి కలిగించే మహత్తర ఘట్టమన్నారు. కుటుంబమంతా పండుగ చేసుకున్నామన్నారు. బాలరామమూర్తిని తీర్చే అవకాశం అరుణ్ యోగిరాజ్‌కు దక్కడం మా కుటుంబానికి ఎనలేని సంతోషమన్నారు. తండ్రి ఉంటే ఎంతో సంతోషించేవారన్నారు. యోగిరాజ్ భార్య విజేత మాట్లాడుతూ బాలరామమూర్తి ప్రతిష్ఠాపన తర్వాత చూస్తే దేవుడు కనిపించాడని సంతోషం వ్యక్తం చేశారు. అరుణ్ యోగిరాజ్ శిల్పం ద్వారా బాలరాముడి రూపాన్ని అద్భుతంగా తీర్చారన్నారు. అయోధ్యలో కార్యక్రమం విజయవంతం కావడం సంతోషమని, అందరికీ ధన్యవాదాలన్నారు. 500 ఏళ్లుగా ఎదురుచూస్తున్న క్షణం వచ్చిందన్నారు. ఇందులో మా కుటుంబ భాగస్వామ్యం ఉండడం మా అందరికీ జీవితకాలం అదృష్టమన్నారు. ప్రస్తుతానికి యోగిరాజ్ అయోధ్యలో ఉన్నారని, వెనుతిరిగి వచ్చాక కుటుంబమంతా కలసి అయోధ్య రామమందిరానికి వెళ్తామన్నారు.

## జంటహత్యల కేసులో ఉరి నుంచి ఊరట

▸▸ యావజ్జీవశిక్షగా మారుస్తూ హైకోర్టు తీర్పు

**బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):** జంటహత్యల కేసులో ముగ్గురికి ఉరి శిక్ష నుంచి ఊరట లభించింది. సెషన్స్ కోర్టు విధించిన ఉరిశిక్షను రద్దు చేసిన హైకోర్టు ధర్మాసనం యావజ్జీవ కారాగారశిక్షగా మార్పుతోపాటు రూ.25వేల జరిమానా విధించింది. వివరాలిలా. బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా మమదాపైరా నివాసి బాబు భార్య సంగీత, బసవరాజ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నారనే అనుమానం ఉండేది. ఇదే కారణంతో 2013 అక్టోబరు 10న బాబుతోపాటు అతడి సోదరుడు నాగప్ప, బంధువులు కలసి సంగీత, బసవరాజ్‌లను హత మార్చారు. 2022 జూన్ 15న బెళగావి జిల్లా సెషన్స్ కోర్టు బాబు, సోదరుడు నాగప్ప, బంధువు ముత్తప్పలకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. తీర్పును ప్రశ్నిస్తూ ముగ్గురు నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తులు శ్రీనివాస్, హరీశ్‌కుమార్, రామచంద్ర డీ హుద్దార్‌లతో కూడిన ధర్మాసనం ఉరిశిక్షను రద్దు చేస్తూ యావజ్జీవ కారాగారశిక్షగా ఖరారు చేశారు. ఈమేరకు సోమవారం తీర్పును వెల్లడించారు. ఆరోపితులు పిటీషన్‌లో తమపై కేసులను పూర్తిగా రద్దు చేయాలనే ప్రతిపాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. రూ.25వేల జరిమానా విధించారు.

## లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం

**బొమ్మనహళ్ళి జనవరి 22:** స్థానిక రూపేన అగ్రహారలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ఠాపన, కుంభా భిషేక కార్యక్రమాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాన నేపథ్యంలో అదే ముహూర్తాన సోమవారం కార్యక్రమాలు జరిపారు. ఆలయంలో గణపతి, ఆంజనేయస్వామి, గాయత్రిదేవి, శనైశ్వర మూర్తులు ఉన్నాయి. 108 కళశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ దాత, స్థానిక బీజేపీ నాయకుడు నరేంద్రబాబు నేతృత్వంలో ప్రధాన అర్చకులు కృష్ణభట్ సహకారంతో 36 మంది రుత్విక్కులతో కైంకర్యాలు సాగాయి. ఉత్సవాలలో మంత్రి రామలింగారెడ్డి, మాజీ ఎంపీ కుపేంద్ర రెడ్డి, ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ తేజస్వీసూర్య, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళశాలతో అర్చకబృందం